

'పంచాయతీరాజ్' మరింత బలోపేతం

- కలెక్టర్ డాక్టర్ సిరి - జడ్‌పిలో డిఎల్‌డిఒ కార్యాలయం ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. గురువారం చిత్తూరు నుండి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. జిల్లా పరిషత్ లో ఏర్పాటు చేసిన నూతన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని లాంఛనంగా కలెక్టర్, డాక్టర్ ఎ.సిరి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జడ్‌పి సిఇఒ నాజర్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ప్రారంభించిందన్నారు. గ్రామస్థాయిలో రోడ్లు, త్రాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. డిపిఒ భాస్కర్, డిఎల్‌డిఒ రమణారెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ ప్లాంట్

ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌లు ఇస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటి వరకు 92469 మంది రిజిస్టర్ అయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ కింద 81591 మంది ఇతరులు 10,878 మంది రిజిస్టర్ అయ్యారన్నారు... ఇందులో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 23077 మంది గృహాలకు రూఫ్‌టాప్ సోలార్లను మార్చి నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ వివరించారు. మోడల్ సోలార్ గ్రామం కింద నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా 6 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. అందులో పెద్దహరివాణం గ్రామంలో ఎక్కువ సంఖ్యలో 5 రూఫ్‌టాప్ సోలార్లు ఏర్పాటు చేసినందుకు సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద అంగన్వాడి సెంటర్లలో, వైద్యశాలల్లో, పాఠశాలల్లో సోలార్ స్ట్రీట్‌లైట్లు, తాగు నీటి ఏర్పాటు కొరకు రూ.కోటి నిధులు మంజూరు అయ్యాయని ఎస్ఇ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ప్రదీప్ కుమార్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, ఎల్‌డిఎం రామచంద్ర రావు, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, మెప్మా పిడి శ్రీనివాసులు, నెడ్ క్యాప్ అధికారి పాల్గొన్నారు.

ఇంత హడావిడి అవసరమా..?

- ఎంపిఎంకు రాజకీయ రంగు తగదు
- విద్యార్థుల అభివృద్ధికి దిశా నిర్దేశం చేయాలి
- ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి
- ఉపాధ్యాయ విద్యార్థి ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను కూడా ప్రచార కేంద్రాలుగా నిర్వహించుకునేందుకు చర్యలు తీసుకుంటుంది. మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పేరుతో హడావుడి చేస్తుంది. ఈ సమావేశంలో కూటమి పార్టీలకు చెందిన నేతలు పాల్గొనడం పట్ల కూడా విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా ఈ సమావేశంలో చర్చ జరగాలని ఉపాధ్యాయ, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మొత్తం 1468 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా ఈ సమావేశంలో విద్యార్థులకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు అందజేయనున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చ నిర్వహిస్తారని పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం పాఠశాలల్లోనే విద్యార్థులకు తల్లిదండ్రులకు అక్కడే మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ సమావేశంలో సామాజిక కార్యకర్తల పేరుతో అధికార పార్టీ కూటమి నేతలు పాల్గొనేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి రాజకీయ జోక్యం చేయడం పట్ల తీవ్ర విమర్శలు కూడా నెలకొంటున్నాయి. ఈ సమావేశంలో ప్రధానంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థి అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయినప్పటికీ గతంలో నిర్వహించిన సమావేశాల్లో ప్రతిపాఠశాలలో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు నాయకులు కోలాహలం కనిపించింది. ఈ సమావేశంలో మాత్రం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై చర్చజరిగి వాటి పరిష్కారానికి అధికారులు వేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ జోక్యాన్ని నివారించాలి



- జి.నవీన్ పాటి, జిల్లా ప్రధాన కార్యదర్శి యుటిఎఫ్

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశంలో రాజకీయ పార్టీల జోక్యాన్ని పూర్తిగా నివారించాలి. ఈ సమావేశంలో ప్రధానంగా ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చ చేపట్టాలి. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యా బోధన చేసేందుకు ప్రణాళికలు రూపొందేలా ఈ సమావేశం తీర్మానించాలి.

ఉత్తమ విద్యా బోధన అమలుకు ప్రణాళిక అవసరం



- రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశం లో ఉత్తమ విద్యా బోధన అమలుకు గాను ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలి. ఈ సమావేశంలో మాత్రం అధికార పార్టీ కూటమి నేతలు పాల్గొనకుండా చేయాలి.

రాజకీయ ప్రచార వేదికగా మార్చరాదు



- షాకీర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ను రాజకీయ ప్రచార వేదికగా మార్చరాదు. ఈ సమావేశంలో పాఠశాల విద్య అభివృద్ధికి కృషి చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేయాలి.

వంద రోజుల ప్రణాళిక అమలు



- డిఇఒ శామ్యూల్ పాల్

ప్రస్తుతం నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశంలో వంద రోజుల ప్రణాళిక అమలుపై చర్చ జరుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు సమావేశంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు చర్చిస్తారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్రభుత్వ విధానాలతో విద్య ప్రయివేటీకరణ

- విద్య, ఉపాధి లేక వలస బాటలో పశ్చిమ ప్రాంతం - ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్
- ఆలూరులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విధానాలతో విద్యను ప్రయివేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ విమర్శించారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలు ఆలూరులో ప్రారంభమయ్యాయి. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ అధ్యక్షతన విద్యార్థులతో ఆలూరులో భారీ ప్రదర్శన చేపట్టి, పాత బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు పరమేష్, జిల్లా కార్యదర్శి రంగప్ప, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఆనంద్ బాబు, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మల్లేష్ మాట్లాడారు. జిల్లాలో విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీఇచ్చారని, అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఇంకా రూ.6,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెబుతున్నారని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళనలు, ధర్నాలు చేపడితే కేసులు బనాయించి పోలీసులతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ.. నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో విద్య, ఉపాధి లేక రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు వలస బాట పడుతున్నారని చెప్పారు. బాలికలకు హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా మాట్లాడుతూ... ఆలూరులో విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి విద్యార్థి బస్సులు, హాస్టల్, ఐటిఐ కళాశాలకు స్థలం, పాలటెక్నిక్‌కు సొంత భవనం, గిరిజన గురుకుల బాలికల పాఠశాల ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా స్థలం కేటాయించినట్లు తెలిపారు. జిల్లా విద్యారంగ, విద్యార్థుల సమస్యలపై మహాసభల్లో తీర్మాణం చేసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంయుక్త, జిల్లా మాజీ సహాయ కార్యదర్శి గోవర్ధన్, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఉమేష్, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు నారాయణ స్వామి, హనుమంతు, ఎస్‌కె.గిరి, షాకీర్, తిక్కస్వామి, మురళీ, శ్రీరామ్, థామస్, సురేష్ పాల్గొన్నారు.



ఆలూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు




మహాసభల్లో మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

కర్నూలు నుంచి విజయవాడకు రైళ్లు నడపాలి

- ఢిల్లీలో సిపిఎం ఎంపీకి వినతి ఇచ్చిన గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం నుండి రాజధాని విజయవాడకు రైళ్ల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖమంత్రికి వినతి పత్రం ఇవ్వాలని కోరుతూ సిపిఎం పార్లమెంట్ సభ్యులు సచ్చితానందంకు కర్నూలు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విన్నవించారు. ఢిల్లీలో ఆలిండియా శిక్షణాతరగతులకు వెళ్లిన గౌస్ దేశాయ్ ఎంపీ క్వార్టర్స్‌లో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎపి రాజధానికి వెళ్లడానికి నేరుగా రైల్వే సౌకర్యం లేనందున కర్నూలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర రైల్వేశాఖకు మా విన్నపాన్ని వివరించాలని కోరారు.



పాలకుల వైఫల్యంతో మహిళలపై హింస

- సదస్సులో మహిళా నేతల విమర్శ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రోజురోజుకు మహిళలపై హింస పెరుగుతోందని, మద్యం మత్తు పదార్థాల విచ్చలవిడి అమ్మకాలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ఇందుకు ప్రధాన కారణమని ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.శ్యామల, నగర అధ్యక్షులు కుమారి, జిల్లా నాయకులు ఎం.ఉమ విమర్శించారు. గురువారం శరీన్‌నగర్‌లో ఐద్వా, ప్రగతి ఐక్య పొదుపు సంఘం, టిఎల్‌ఎఫ్ సంఘాల సభ్యులతో హింస వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా సదస్సు నిర్వహించారు. జిల్లా ఐద్వా నాయకులు ఎం.ఉమా అధ్యక్షత వహించగా శ్యామల, కుమారి మాట్లాడారు. మద్యం, మత్తు పదార్థాలను అరికట్టడానికి పటిష్ట చర్యలు తీసుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉంటున్నాయన్నారు. మాతృస్వామ్య వ్యవస్థ పతనమైన తర్వాత నేటి నాగరిక కాలం వరకు మహిళలపై వివక్ష కొనసాగుతోందని తెలిపారు. నేడు మహిళలపై హింస, అఘాయిత్యాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఆదాయం కొరకు విచ్చల విడిగా మద్యం ఏరులై ప్రవహించేలా అడుగడుగునా మద్యం షాపులకు లైసెన్స్ ఇస్తున్నారని విమర్శించారు. కొంత మంది యువత మద్యానికి గంజాయి లాంటి డ్రగ్స్‌కు అలవాటు పడి సమాజంలో అనేక రకాల వికృత చేష్టలకు, పాల్పడుతున్నారని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పిస్తూ వివక్షత లేకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలను తీసుకుంటున్నాయన్నా రు. నేటికీ మన దేశంలో స్త్రీలపై ఆంక్షలు చాలా అధికంగా ఉన్నాయన్నారు. లింగ వివక్షత కొనసాగు తున్నదని తెలిపారు. మహిళలు సంఘటితమై సమాజంలో జరుగుతున్న హింస,వివక్షత పైన, ప్రభుత్వ ఉదాసీనత పైన పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బి.లక్ష్మీదేవి ,రేణుక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలివేలమ్మ



ఇబ్బందిగా ఉన్న రోడ్డును చూపుతున్న సిపిఎం నాయకులు

రిచ్ మండ్ కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 36వ వార్డు మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్న నగర శివారు కాలనీలుగా ఉన్నరిచ్ మండ్ కాలనీ ఇతర కాలనీలకు వెళ్లే 100 అడుగుల రోడ్డు నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గుంతలు బడి ప్రజలు నడవడానికి వీలులేని విధంగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉండడంతో సిపిఎం ప్రతినిధి బృందం గురువారం పర్యటించింది. కర్నూలు నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, ఆర్.నరసింహులు, కె.సుధాకర్‌అప్ప. వై.నగేష్, నగర కమిటీ సభ్యులు ఎస్.మొహమ్మద్ రఫీ, జి.యేసు, ఎస్.హుశేన్‌బాషా,శ్రీనివాసులు, కిట్టు ఇతర కార్యకర్తలతో కలిసి రోడ్డు సమస్యను పరిశీలించారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఉన్న రిచ్ మండ్ కాలనీ ఇతర కాలనీలకు వెళ్లే ప్రధానమైన రోడ్డు వేయాలని చాలా కాలం నుండి స్థానిక ప్రజలు, సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పన్నులపై ఉన్నంత శ్రద్ధ పనులు చేయడంలో ప్రజలకు సౌకర్యాలు అందించడంలో కార్పొరేషన్ అధికారులకులేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు , డ్రెయినేజీ కాలువలు , తాగునీటి సమస్యపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. అనేక కాలనీలకు ప్రధాన రహదారిగా ఉన్న బళ్లారి రోడ్డు నుండి రిచ్ మండ్ కాలనీ వరకు 100 అడుగుల రోడ్డును సిసి రోడ్డుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాలనీల ప్రజలను సమీకరించి కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అపర చాణక్యుడు రోశయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అపర చాణక్యుడు కొనిజేటి రోశయ్య అని సిటి కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానిబాష అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాలుగవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లాని బాషతో, మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి మెంబర్ ఎం.సుధాకర్ బాబు, ఐ ఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి బజారన్న, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

-వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు సూచించారు. గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ విసి వెంకట బసవరావు పోటీప్రపంచంలో నిలదొక్కుకొనే నైపుణ్యాలను ప్రతిఒక్కవిద్యార్థి అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతిఒక్క విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడేవిధంగా తయారు కావాలన్నారు. నిపుణులైన అధ్యాపకుల సూచనలు, సలహాలతోపాటు, లైబ్రరీ, ల్యాబులు, ఆటస్థలం మొదలైన వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్సిటీలో చేరిన ప్రతివిద్యార్థి తన కోర్సు పూర్తయి బయటికి వెళ్లే సమయానికి కుటుంబానికి అండగా నిలవాలని వర్సిటీ రెక్టార్ ఎన్‌టికె. నాయక్ ఆకాంక్షించారు. ఈ సంవత్సరం నూతనంగా డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభించడంవల్ల అదనంగా దాదాపు 80 మంది విద్యార్థులకు చదువుకునే సౌకర్యం కలిగిందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు హర్షంవ్యక్తంచేశారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా ఆటల విజేతలకు విసి,రెక్టార్ ,రిజిస్ట్రార్‌లు బహు మతులిచ్చారు. వర్సిటీ కాలేజి ప్రిన్సిపల్ సి.విశ్వనాథరెడ్డి, డీన్‌ఆఫ్ అకడమిక్ అఫైర్స్ సివి.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ పివి. సుందరా నంద్, ఐక్యూఎసికోఆర్డినేటర్ ఆర్.భరత్ కుమార్ , అధ్యా పకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విసి వెంకట బసవరావుతో ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఘంటసాల పాటలు రోజు వింటే మనసు ప్రశాంతంగా ఉండి ఆనారోగ్య సమస్యలు దూరమౌతాయని, ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని డాక్టర్ శంకర్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలులో ఘంటసాల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో కర్నూలులోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఘంటసాల అభిమానులు, గాయకులు, సీనియర్ వైద్యులు ఘంటసాల గొప్పతనాన్ని కోనియాడారు. ఘంటసాల పాటలు రోజు వింటే మనసు ప్రశాంతంగా ఉండి ఆనారోగ్య సమస్యలు దూరమౌతాయని వైద్యులు తెలిపారన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని కోరారు. తెలుగు జాతి గర్వించదగ్గ మనిషి ఘంటసాల అని కొనియాడారు. తెలుగుభాషతో పాటు కనడ, తమిళం, హిందీ పలు భాషల్లో పాటలు పాడిన ఘనత ఘంటసాలకే దక్కిందన్నారు. ఘంటసాల గాయకుడే కాక నటన, సంగీతం, దర్శకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఘంటసాల చిన్న వయసులోనే మరణించడం భాదాకరమన్నారు. ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు వాసు, డాక్టర్. డబ్ల్యు సీతారాం, డాక్టర్‌శంకర్ శర్మ, చంద్రశేఖర్ కల్కూర, డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, ఎలమర్తిరమణయ్య, రాఘవేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల జయంతిలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆక్రమణలు, డంప్ యార్డుగా 'హంద్రీ'

- మరో మూసీ కాకూడదు - నేడు హంద్రీ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజకీయ నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో హంద్రీనది ఆక్రమణలకు గురవుతూ కుంచించు కుపోతోంది. వ్యర్థాలను, జంతు కళేబరాలను తెచ్చి డంప్ చేయడంతో మూసీనదిలా తయారవుతోంది. భవిష్యత్తులో వరదలు వస్తే నగరాన్ని ముంచి వేసే ప్రమాదం పొంచి ఉంది. శుక్రవారం హంద్రీ దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

కర్నూలు నగర చరిత్ర హంద్రీనదితో ముడిపడి ఉంది. ప్రాచీన గ్రంథాల్లో హంద్రీని ఐంద్రావతిగా, 'అందరీనది'గా పిలిచేవారు. కాలక్రమేణా హంద్రీగా మారింది. పత్తికొండ సమీపంలోని మద్దికెర, మొగలిపల్లి ప్రాంతాల దగ్గర హంద్రీనది ప్రవాహం మొదలవుతుంది. హంద్రీ పొడవు 130 కి.మీ. వక్కెరవాగు, కనికదిన్నె వాగు ఈ నదిలో కలుస్తున్న ప్రధాన నీటి ప్రవాహాలు. ఒకప్పుడు కర్నూలు నగరంతోపాటు దాదాపు 50 గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చిన ఘన చరిత్ర హంద్రీది. హంద్రీ నది తుగభద్ర నదికి ఉపనది. ప్రపంచ వారసత్వ నీటిపారుదల నిర్మాణాలలో ఒకటిగా నిలిచిన కెసి కెనాల్ హంద్రీనదిపై తుంగభద్రనది నీటితో ప్రవహించడం మరో అద్భుతంగా చెప్పవచ్చు.

60 నుండి 70 శాతం ఆక్రమణ : లక్ష్మీపురం నుంచి జోహరాపురం వరకు దాదాపు 10 కిలోమీటర్ల హంద్రీ ప్రాంతంలో 60 నుండి 70 శాతం ఆక్రమణలు గుర్తించారు. గాజులదిన్నె ప్రాజెక్ట్ (సంజీవయ్య సాగర్) నిర్మాణం (1987లో) పూర్తయిన తర్వాత ఈ ఆక్రమణల ప్రక్రియ జోరందుకుంది. ఇసుక అక్రమ తవ్వకాలతో నదిని జీవం లేకుండా చేస్తున్నారు.

ప్రమాదకర స్థాయిలో నీటి కాలుష్యం : వ్యర్థ జలాల శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల హంద్రీ నదిలో కలుస్తున్న మురుగునీరు ప్రమాదకర స్థాయికి చేరుకుంది. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను కూడా అధికార యంత్రాంగం లెక్క చేయడం లేదు.

డంప్ యార్డ్ : హంద్రీనది ప్రస్తుతం మురుగు, వ్యర్థాలతో డంపుయార్డును తలపిసోతంది. పారిశ్రామిక, స్థానిక సంస్థలు ఎవరూ ఏ విధంగానూ జల వనరులను కలుషితం చేయకూడదు. నీటి వనరుల ప్రాంతాల ఆక్రమణలను, వ్యర్థాలతో, మురుగునీటితో కలుషితం చేయడాన్ని అనుమతించదు. కానీ అధికార యంత్రాంగం ఇవేమీ పట్టించుకోడం లేదు.

తక్షణం చేపట్టాల్సిన చర్యలు: జల వనరుల శాఖ సాటి లైట్ మ్యాపింగ్ ద్వారా హంద్రీనది ప్రాంతాన్ని కాపాడాలి. జియో ట్యాగింగ్ చేయాలి. నీరు, భూమి, చెట్ల చట్టం వాల్టా 2002ను అమలు చేయాలి. సరిహద్దులను ఏర్పరిచి వరద గోడ నిర్మాణం చేపట్టాలి. నది ఆక్రమణకు గురైన ఇళ్ల లేఅవుట్ ఆమోదాలను పునర్విచారించాలి. వ్యర్థాలు, డ్రెయినేజీ నీటిని డంపింగ్ చేయడంపై చర్యలు చేపట్టాలి. కుడా ఆమోదాలు పొందిన నదీ ప్రాంత వెంచర్ల లేఅవుట్లను పునర్ పరిశీలించాలి. రెవెన్యూ శాఖ భూ హక్కుల రికార్డుల ప్రకారం పట్టాలు ఇవ్వాలి. గనులు , భూగర్భ శాస్త్ర శాఖ అక్రమ ఇసుక మైనింగును సరిహద్దు భూముల తవ్వకాలను అరికట్టాలి. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల విభాగం హంద్రీనది ప్రాంతానికి దగ్గరగా ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్య, ఆరోగ్య శాఖ పాత బస్తీలో దోమలు, వైరల్ జ్వరాలు నివారణ చర్యలు చేపట్టాలి. కాలుష్య నియంత్రణ బోర్డు తరచూ నీటి కాలుష్య నివేదికలను సిద్ధం చేయాలి.

హంద్రీ మరో మూసీ కాకూడదు


- న్యూ కర్నూలు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కె తిరుపాల్‌రెడ్డి

హంద్రీనది ఆక్రమణలు, బిల్డింగ్ మెటీరియల్, జంతు కళేబరాలు, మురుగు నీరు కలిసి కంపు కొడుతుంది. నదిని కాపాడాలని మా సొసైటీ తరపున కలెక్టర్‌కు, ఎస్‌పికి, కమిషనర్‌కు, ప్రజా ప్రతినిధులకు విన్నవించాం. ఏమాత్రం స్పందించకపోవడంతో చాలా బాధేసింది. హంద్రీ నదిని రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది. లేకపోతే వరదల్లో ముంచేస్తుంది.



మురుగునీరు పారుతున్న హంద్రీనది

సరిహద్దులు గుర్తించి రక్షించాలి



- ఎస్.మన్సూర్ రెహ్మాన్, ఆర్థిక సామాజిక విశ్లేషకులు

హంద్రీనదిని శాటిలైట్ ద్వారా సరిహద్దులు గుర్తించి రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. హంద్రీనది పరిరక్షణ కోసం హంద్రీ డే సందర్భంగా పాఠశాలల్లో, కళాశాలలో మేధావుల సమక్షంలో నదులను పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించనున్నాం. ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుని నదులను రక్షించాలి. అప్పుడే మానవ మానవమనుగడకు ముప్పు ఉండదు. అయితే దీని రక్షణకు పాలకు చిత్తశుద్ధి అవసరం ....

హంద్రీలో ఎలాంటి కట్టడాలకు అనుమతించం

- కమిషనర్ పి విశ్వనాథ్



హంద్రీ నదిలో భవనాలను కూల్చిన వ్యర్థ పదార్థాలను తెచ్చి వేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ఒకవేళ వేసి చదును చేసినప్పటికీ అక్కడ ఎలాంటి కట్టడాలను కట్టడానికి అనుమతించం.

చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

ప్రజాశక్తి - చిప్పగిరి


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌ఐ సతీష్ కుమార్

వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం చిప్పగిరి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎస్పీకి డీఎస్పీ వెంకటరామయ్య, ఎస్‌ఐ సతీష్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిపై సమగ్రమైన కేసుల ఫైళ్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదు చేసి శిక్షలు పడే విధంగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీలు చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేటట్లు అవగాహన కల్పించాలని ఎస్‌ఐని సూచించారు. ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, ట్రైనీ ఎస్‌ఐ రాజా కుళ్లాయప్ప పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమం : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కార్మిక వ్యతిరేక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు కోరారు. గురువారం సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు అధ్యక్షత వహించారు. రామాంజనేయులు, సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కరోనా సమయంలో కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ బిల్లును ఆమోదించిందని తెలిపారు. సిఐటియు మండల నాయకులు ఎ.సురేష్, యు.రమేష్, డి.ఉస్మాన్‌వలీ, ఎస్.నాగలక్ష్మి, కె.మంజుల, బి.తిమ్మప్ప, బి.గోపాల్, కె.బాష, ఎస్.షబ్బీర్, ఎ.రమేష్ పాల్గొన్నారు.

మెగా పిటిఎంకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న మెగా పిటిఎంకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని సిబ్బంది ఆహ్వానించారు. గురువారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో కలుసుకొని సమావేశ నిర్వహణపై వివరించారు. మండలంలోని చిల్కలడోణ గ్రామ సమీపంలో ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరవుతారని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అశోక్ నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వస్తామని చెప్పారు. మోడల్ స్కూల్ సిబ్బంది ప్రసాద్, షరీఫ్ వలీ, సోమలింగం ఉన్నారు.

రాజశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి - హొళగుంద


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మేజర్ పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి (ఎఫ్‌ఎసి)గా విధులు నిర్వహిస్తున్న బళ్లారి రాజశేఖర్ గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శిగా ప్రమోషన్ పొందడంతో ఆయనను సన్మానించారు. గురువారం ఎంపిడిఒ విజయ లలిత, పంచాయతీ కార్యదర్శులు రంగస్వామి, నాగరాజు, రాజ్ కుమార్, నాగరాజు, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది ఆయనను సన్మానించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... మేజర్ పంచాయతీ కార్యదర్శిగా గత ఏడేళ్లలో సేవలు అందించారని కొనియాడారు.

దుండగులను చట్టపరంగా శిక్షించాలి

ప్రజాశక్తి - హొళగుంద : మండలంలోని ఎల్లార్తి గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహంపై పేడ వేసి అవమానించిన దుండగులను చట్టపరంగా శిక్షించాలని దళిత, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు డిమాండ్ చేశాయి. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ... ప్రపంచ దేశాలు గర్వించ దగ్గ మహనీయుల విగ్రహాలపై ఇలాంటి నీచ పనులు చేయడం సిగ్గుచేటన్నారు. దుండగులను సిసి కెమెరా ఫుటేజ్ ద్వారా గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

మండలంలో జెసి పర్యటన

- ఐరన్ బండలో మునక భూముల పరిశీలన - జెసి కారు ముందు బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలంలో జెసి నూరుల్ కమర్ గురువారం పర్యటించారు. ముందుగా గోనెగండ్లలోని గాజులదిన్నె (సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు ఎడమ కాలువకు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కె.మల్లికార్జున గౌడ్, ప్రాజెక్టు అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఐరన్‌బండ గ్రామంలో గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో ముంపునకు గురవుతున్న భూములను పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తి విస్తీర్ణం, భూ సేకరణ వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టులో నీరు తగ్గినప్పుడు వేసవిలో ప్రాజెక్టు భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు.. గుర్తించి అక్కడ గుర్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతుల పట్టా భూముల్లోకి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. భూముల పరిశీలనకు వెళ్తున్న జెసి కారును ప్రాజెక్ట్ నీటితో ముంపునకు గురవుతున్న భూముల రైతులు అడ్డగించి బైఠాయించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని 4.5 టిఎంసిల నుంచి 5.5 టిఎంసిలకు పెంచుతున్నామని చెప్పి అధికారులు పనులు ప్రారంభించారని, భూసేకరణ సక్రమంగా చేయకుండా.. పూర్తిస్థాయిలో ముంపునకు గురయ్యే భూములను గుర్తించకుండా.. రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా ప్రాజెక్టులో నీటిని 377 మీటర్ల మేర నిల్వ ఉంచడం వల్ల ప్రతేడాది తమ పట్టా భూముల్లోని పంటలు ముంపునకు గురయి నష్టపోతున్నామని రైతులు వాపోయారు. పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, పూర్తిస్థాయిలో భూ సేకరణ చేసి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. భూమికి బదులుగా భూమి ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. రైతు సమస్యలపై పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతామని జెసి హామీ ఇచ్చారు. తహశీల్దార్ రాజేశ్వరి, ప్రాజెక్టు డిఇ సుబ్బరాయుడు, ఎఇలు అలీ, శంకర్, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, నాయకులు కైరవాడి తిమ్మారెడ్డి, తిరుపతయ్య నాయుడు, ఐరన్‌బండ, నజీర్ సాహెబ్ పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న జెసి


జెసి కారు ముందు బైఠాయించిన రైతులు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నందవరం

సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి, జిల్లా కౌన్సిలర్ ఎల్లప్ప కోరారు. గురువారం నందవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగాలంటే రెండేళ్లలో పోస్టుకు సంబంధించిన అర్హత పరీక్ష టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్డ్ కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని సవరణ చేసి టెట్ నుంచి 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు.

మండల కమిటీ ఎన్నిక : మండల కమిటీని ఎన్నికల అధికారి, పర్యవేక్షకులు నవీన్ పాటి, దావీదు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎ.విరుపాక్షి, అధ్యక్షులుగా ఆర్.వెంకట్ రాముడు, సహాధ్యక్షులుగా కె.పద్మావతమ్మ, టి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎ.రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నరసింహులు, మండల కార్యదర్శులుగా 15 మందిని ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా జె.ఎల్లప్ప ఎ.దేవపాల్, బి.రాఘవేంద్ర, ఎస్.పరమేష్, ఎస్.ప్రసాద్, పద్మావతమ్మ, అరుణను ఎన్నుకున్నారు. భాగ్యరాజు, పాలాగి, నరసన్న, నారాయణ, దేవేంద్రబాబు, మహబూబ్ బాష, రాజు, బజారి, యూనుస్, ఈరన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కౌన్సిలర్ జె.ఎల్లప్ప

టిడిపి ఇన్‌ఛార్జీ దృష్టికి తిమ్మాపురం సమస్యలు

ప్రజాశక్తి - చిప్పగిరి

నగరడోన పంచాయతీ మజరా గ్రామమైన తిమ్మాపురంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి దృష్టికి తెచ్చారు. గురువారం సాగునీటి సంఘం అధ్యక్షులు నగరడోన కిష్టప్ప, తిమ్మాపురం శేఖర్ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామస్తులు సమస్యలను వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌కు వివరించారు. గ్రామంలో రీసర్వే జరిగినప్పుడు గ్రామంలోని చాలామంది రైతులకు సంబంధించిన భూములు ప్రభుత్వ భూములుగా అధికారులు చూపించారని, ఇప్పటికీ ఆన్‌లైన్‌లో అలాగే చూపెడుతున్నాయని తెలిపారు. గ్రామంలో తాగునీరు, పబ్లిక్ టాయిలెట్ సమస్యలు ఉన్నాయని, పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ... గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతామని తెలిపారు.


వైకుంఠం జ్యోతితో సమస్యలు విన్నవించుకుంటున్న గ్రామస్తులు

అన్నదానానికి మారుతి నాయుడు విరాళం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గరుడాద్రి రామసుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో జరిగే మహా మండల పూజా కార్యక్రమంలో అన్నదానానికి టిడిపి యువ నాయకులు మారుతి నాయుడు విరాళం అందజేశారు. శుక్రవారం మండల పూజా కార్యక్రమంలో భాగంగా విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు గరుడాద్రి సుబ్బయ్య శాస్త్రి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి జరిగే అన్నదానంలో టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు కుటుంబం పాల్గొంటున్నట్లు చెప్పారు. టిడిపి నాయకులు శ్రీనివాస్ ఆచారి, యువ నాయకులు వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న మారుతి నాయుడు

వేరుశనగ గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ గ్రేడింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు సంఘం ఆధ్వర్యంలో వేరుశనగ పంట గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కొన్ని నెలలుగా గ్రేడింగ్ విధానం రద్దు చేశామని మార్కెట్ యార్డు అధికారులు, పాలకవర్గం ప్రచారం చేస్తోందని, వాస్తవానికి ఇంకా వేరుశనగ గ్రేడింగ్ విధానం కొనసాగుతూనే ఉన్నా.. ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డులలో ఈ గ్రేడింగ్ విధానం లేదని తెలిపారు. ఒక్క ఆదోనిలో మాత్రమే వేరుశనగ పంట గ్రేడింగ్ విధానం కొనసాగుతోందని, దీనివల్ల వేరుశనగ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ గ్రేడింగ్ విధానం కొనసాగుతోందని, ఇప్పటికే చాలామంది రైతులు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వేరుశనగ పంటను అధిక ఖర్చులు పెట్టి తీసుకెళ్లి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈఏడాది అధిక వర్షాల వల్ల వేరుశనగ దిగుబడి తగ్గిపోయి రైతులు అవస్థలు పడుతుంటే కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,260 అమలు కావడం లేదని చెప్పారు. మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా వ్యాపారులకు ప్రభుత్వం లాభం చేకూరుస్తోందని విమర్శించారు. వేరుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధరకు వేరుశనగ పంట కొనుగోలు చేయాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ యార్డు కార్యదర్శి గోవింద్ దృష్టికి తీసుకెళ్లారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశులు

అందరికీ ఉపాధి కల్పిస్తాం

- పీడీ వెంకటరమణయ్య

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద అందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య తెలిపారు. ఈనెల 3వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో 'పల్లెలు వదిలి.. పట్టణాలకు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం సిబ్బంది ద్వారా గ్రామాల్లో దండోరాలు వేయించి జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యవసాయ కూలీకీ పనులు కల్పిస్తామని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం ద్వారా అక్కడ సరైన వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. గ్రామాల్లోనే ఉపాధి పనులకు వెళ్లాలని ఉపాధి సిబ్బంది సూచించారు.

మదిరేను ఆదోనిలోనే ఉంచాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం మదిరే గ్రామాన్ని ఆదోని మండలంలోని కొనసాగించాలని గురువారం మదిరే కూడలి సిరుగుప్ప రోడ్డుపై ధర్నా చేపట్టారు. మదిరే భాస్కర్ రెడ్డి, మహిళా నాయకులు మణెమ్మ, సుజ్ఞానమ్మ మాట్లాడుతూ... మండలంలో 16 గ్రామాల ప్రజల అనుమతి లేకుండా పెద్దహరివాణం గ్రామంలో విలీనం చేస్తామంటూ అధికారులు తెలపడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆదోని మండలం నుంచి గ్రామాలను విడదీయాలని చూస్తున్న సబ్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని గ్రామాల అభిప్రాయాలను సేకరించి ఆదోని మండలంలోనే కొనసాగించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గోనెహాల్ గోపాల్ రెడ్డి, మదిరే సర్పంచి నారాయణ, చిన్నహరివాణం సర్పంచి రామకృష్ణారెడ్డి, పార్వతపురం రామస్వామి పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

- ఎంఇఒ శోభారాణి నివాళి

ప్రజాశక్తి - కౌతాళం



పాముకాటుకు గురయి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని చిరుత పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన లింగన్న, ఉరుకుందమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అర్జున్ (11) స్థానిక ఎంపిపి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. విషయం గుర్తించకపోవడంతో కడుపు నొప్పి ఉందని ఉరుకుందలోని ఒక ప్రయివేట్ వైద్యుని వద్దకు తీసుకెళ్లగా పాము కాటు కాటు వేసినట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని సూచించారు. ఆదోనికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో అర్జున్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ శోభారాణి, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ గ్రామానికి వెళ్లి నివాళులర్పించి ఆర్థిక సహాయం అందజేశారు.

బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - నందవరం



గతనెలలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ బేస్‌బాల్ పోటీల్లో నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సి.శ్రీనందిని బంగారు పతకం సాధించారు. జిల్లా తరపున పాల్గొని, మొదటి స్థానం సాధించి బంగారు పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణరాజు గురువారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాపతిని అభినందించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శేఖరప్ప, బసవ రాజు, ఎల్లప్ప, హుస్సేని, ఉమాదేవి, లక్ష్మీ కళ, విజయలక్ష్మి, వాసవాణి పరిమళ, ఎర్రి స్వామి పాల్గొన్నారు.


అధికారికి వినతి పత్రం ఇస్తున్న పెద్దహరివాణం గ్రామ వాసులు

జిల్లా సాధనకు ఉద్యమం తీవ్రం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధన కోసం ఉద్యమం రోజురోజుకు తీవ్రమవుతోంది. జిల్లా ప్రకటన రాకమునుపే ఆదోని నియోజకవర్గంలో పెద్దహరివాణం గ్రామాన్ని చుట్టుపక్కల గ్రామాలను కలిపి మండలంగా ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు జిఒ విడుదల చేసింది. విన్నపాలు, అభ్యంతరాలు తెలుపుకునేందుకు నెల గడువు విధించింది. ఆలూరు రోడ్డులో ఉన్న ఢణాపురం, నారాయణపురం, చాగి నాగనాథనహళ్లి గ్రామాలతో పాటు గణేకల్, మదిరే, చిన్నహరివాణం, చిన్న గోనెహాలు గ్రామస్తులు భగ్గుమన్నారు. పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలు కలపొద్దంటూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద గ్రామస్తులు కలెక్టర్ సిరిని అడ్డుకున్నారు. పెద్దహరివాణం గ్రామం పట్ల టిడిపి నాయకులు చిన్న గోనెహాల గోపాల్ రెడ్డి కించపరిచేలా వ్యాఖ్యానించారని, క్షమాపణ చెప్పాలంటూ పెద్దహరివాణం గ్రామస్తులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. గ్రామం సాంప్రదాయాలు, కట్టుబాట్ల గురించి ఆయన చులకనగా మాట్లాడారని, బహిరంగ క్షమాపణ చెప్పకపోతే చూస్తూ ఊరుకోబోమని గ్రామస్తులు నినాదించారు. తమ గ్రామంలో కలిపేందుకు ఇష్టం లేని వారిని తొలగించాలని పెద్దహరివాణం మండల సాధన కమిటీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, మధు, పరమేష్, నాగరాజు, మారెప్ప, సర్పంచి రాము ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

జిల్లా సాధనకు 19వ రోజూ దీక్ష

ఆదోని జిల్లా సాధన కోసం నిరసన దీక్ష కొనసాగుతూనే ఉంది. గురువారం పట్టణంలోని కోట్ల విగ్రహం ముందు చేపట్టిన దీక్ష శిబిరం 19వ రోజుకు చేరింది. జెఎసి రిలే నిరాహార దీక్షలో మేదరి సంఘం సభ్యులు కూర్చుని సంఘీభావం తెలిపారు. ఎంఎస్.రాజు, ఎంఎస్.వీరయ్య, టిఎం.బాలకృష్ణ, ఎంఎస్.శివ, పిఎం.ఇందిరా, ఎంఇ.చత్రపతి, ఎంఇ.రంగస్వామి, టిఎం.నల్లా రెడ్డి, బి.రామాంజనేయులు, ఎంఎస్.ఈశ్వర్, ఎం.తిరుమలేష్, ఎంఎస్.మంజునాథ్, వైఎం.అమ్రేష్, ఎంఎస్.నరసింహులు, టిఎం.తాయన్న దీక్షల్లో కూర్చున్నారు. వారికి జిల్లా సాధన కమిటీ నాయకులు లలిత, రఘురామయ్య, కృష్ణమూర్తి, వీరేష్, దస్తగిరి నాయుడు, కోదండ, సుజ్ఞానమ్మ పూలమాల వేసి దీక్షలను ప్రారంభించారు.

జిల్లాగా ప్రకటించాలి : జెఎసి

ప్రజాశక్తి - మంత్రాలయం : పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని ఆదోని జిల్లా జెఎసి కన్వీనర్ కోదండ, ఎమ్మిగనూరు కన్వీనర్ కామిలి గణేష్, వైసిపి మండల ఉపాధ్యక్షులు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ఆదోని డివిజన్‌లో ఉన్న నియోజకవర్గాలు అత్యంత వెనుకబడిన ప్రాంతాలని ప్రభుత్వానికి తెలిసిందేనన్నారు. జిల్లాగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఆదోనిలో జరుగుతున్న దీక్షకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మద్దతు ప్రకటించారని, జిల్లా సాధనకు అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా కూడా చేస్తానని చెప్పారని సర్పంచి భీమయ్య తెలిపారు. కోకన్వీనర్ దస్తగిరి నాయుడు, ఎమ్మిగనూరు కోకన్వీనర్ ఖాజా, విహెచ్‌పిఎస్ సత్యనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైసిపి నాయకులు గోర్కల్ కృష్ణస్వామి, శివప్ప, కురువ మల్లికార్జున, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదోని జిల్లాగా ప్రకటించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : కరువు, వలసలకు నిలయమయిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిని జిల్లా చేయాలని కాంగ్రెస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాసీం వలీ, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్ తెలిపారు. గురువారం డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు షబ్బీర్, ఖాసీం, గణేష్, ముస్తఫా, అహ్మద్ బాషా, శేషాద్రి, పరమేశ్వర, ఉసమా పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెజిబివిలో జిసిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - హాలహర్వి



హాలహర్వి కెజిబివిని జిసిడిఒ మేరీ స్నేహ లత గురువారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి బాలికలు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్‌ను ప్రత్యేకంగా పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించారు. పాఠశాలలో అందే మౌలిక వసతుల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... సిబ్బంది సమయపాలన పాటించాలని, బాలికలకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఇంటర్మీడియట్ బాలికలు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక కృషి చేయాలని తెలిపారు. పాఠశాలలో పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, కలిగించినా లేదా సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఒ పద్మావతి ఉన్నారు.

ఇన్‌ఛార్జీ కార్యదర్శిగా రాముడు యాదవ్

ప్రజాశక్తి - దేవనకొండ



దేవనకొండ పంచాయతీ ఇన్‌ఛార్జీ కార్యదర్శిగా రాముడు యాదవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన మహ్మద్ రఫీ మండల సచివాలయ అధికారిగా ప్రమోషన్‌పై వెళ్లడంతో తెర్నేకల్ గ్రామ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి రాముడు యాదవ్‌కు అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

కనుల పండువగా రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సజ్జలగూడెం గ్రామ సమీపంలో వెలసిన మార్లబండ ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం అశేష జనవాహిని మధ్య కనుల పండువగా సారిగింది. స్వామివారికి వేకువజాము నుంచి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫల, పుష్ప అలంకరణ, మహా మంగళ హారతులు, కుంకుమార్చన, ఆకు పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని తుంగభద్ర జలాలతో అభిషేకించారు. సజ్జలగూడెం గ్రామం నుంచి గ్రామస్తులు కుంభాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు మురళీ దొర, శ్రీనివాస్ దొర, శ్యాంసుందర్ రాజు, గ్రామ పెద్ద విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో దేవాలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సంధ్యా వేళ అశేష జనవాహిని మధ్య రథోత్సవం లాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా సిఐ మంజునాథ్, ఎస్‌ఐ రమేష్ రెడ్డి, ట్రెయినీ ఎస్‌ఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - దేవనకొండ

మృతురాలి కుటుంబానికి జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. దేవనకొండ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు ఎస్సీ కాలనీకి చెందిన పి.అంజలి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సరోజ, నాయకులు కటిక ఉచ్చీరప్ప, రామాంజనేయులు గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన నాయకులు బొడ్డు నాగరాజు, బంగి బాలు, పరమేష్, రమేష్, సతీష్, ఖలీల్, రాకేష్ పాల్గొన్నారు.

దళిత మహిళకు న్యాయం చేయాలి

- తహశీల్దార్ కార్యాలయం ముందు గుడిసె వేసి నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సామాజిక వెలివేతకు గురయి, నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్న ఓ దళిత మహిళకు న్యాయం చేయాలంటూ గురువారం సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య ఆధ్వర్యంలో బాధితురాలితో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు గుడిసె వేసి నిరసన చేపట్టారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మ కుమారుడు వేరే కులానికి చెందిన మహిళను వివాహం చేసుకోవడంతో గ్రామంలో ఘర్షణలు తలెత్తాయి. గ్రామస్తులు ఆ కుటుంబాన్ని వెలివేయగా, శాంతిభద్రతల సమస్యల దృష్ట్యా రెవెన్యూ, పోలీసు అధికారులు ఆమెను గ్రామానికి వెళ్లకూడదని ఆదేశించారు. గ్రామానికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్న తనకు నివసించేందుకు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని గోవిందమ్మ అధికారుల చుట్టూ తిరగడంతో, స్పందించిన కలెక్టర్ ఆమెకు ఎమ్మిగనూరులో నివాస స్థలం మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశించి రోజులు గడుస్తున్నా తహశీల్దార్ స్థలం కేటాయింపులో జాప్యం చేస్తుండడంతో గోవిందమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తామెక్కడ ఉండాలో అర్థం కావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని సమత సైనిక్ దళ్ నాయకుడు రంగన్న ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోనే గుడిసె వేసి నివసించేందుకు సిద్ధమవడంతో అక్కడ కాసేపు గందరగోళం నెలకొంది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శేషఫణి ఆందోళనకారులతో చర్చించి గోవిందమ్మకు వారం రోజుల్లోగా నివాస స్థలం కేటాయిస్తామని హామీఇవ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు. సమత సైనిక్ దళ్ రాయలసీమ నాయకులు పరమేష్, గోవిందు, వెంకటేష్, రంగస్వామి, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు చార్లెస్, బతుకమ్మ పాల్గొన్నారు.


తహశీల్దార్, పోలీసులతో మాట్లాడుతున్న బాధితురాలు

కార్యకర్తలకు అండగా చంద్రబాబు

- టిడిపి నాయకులు ఖాసీంవలీ, డబ్బా ఈరన్న

ప్రజాశక్తి - నందవరం


చెక్కు అందజేస్తున్న నాయకులు

టిడిపి కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉన్నారని టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న తెలిపారు. 5 నెలల క్రితం కనకవీడు గ్రామంలో టిడిపి కార్యకర్త కురువ నరసింహులు ప్రమాదవశాత్తు మరణించారు. గురువారం బాధిత నివాసానికి చేరుకొని నరసింహులు ఫొటోకు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి సభ్యత్వం ఉండడం వల్ల ఆయనకు పార్టీ తరపున రూ.5 లక్షల బీమా వచ్చినట్లు తెలిపారు. పార్టీకి రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మైనార్టీ నాయకులు ఎన్‌ఎ.జబ్బార్, సత్యారెడ్డి, రామకృష్ణారెడ్డి, సామ్యేల్ పాల్గొన్నారు.

IN THE COURT OF IIND ADDL DISTRICT JUDGE, KURNOOL AT ADONI
O.S.NO. 7/2024

Between:
Zilekha Banu and two others. ...Plaintiffs
V/s.
Gulla Abdul Nabi and 33 others. ...Defendants
TO:
D-33. Vadde Venkata Lakshmi
W/o Vadde Thimmappa, aged about 40 years, Housewife, resident of H.No.16/299, Yermmiganur, Kurnool District.
D-34. Vadde Bharat Kumar
S/o Vadde Thimmappa, aged about 22 years, Mason, resident of H.No.16/299, Yemmiganur, Kurnool District.

Whereas the above named the Plaintiffs filed a suit for partition and separate possession of the suit schedule properties. You are hereby directed to appear before this Honorable court on dt.16-12-2025 at 10-30 AM., either in person or through your Advocate and file Written statement if any, failing which, the matter will be decided in your absence and you will be set exparte.

SHRI. Y.R. MALLIKARJUNA
SHRI. S.SALMAN SAIF
ADVOCATES FOR PLAINTIFFS.
ADONI-518301.
HEARING DATE: 16-12-2025.

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE, KURNOOL AT ADONI
I.A.No.70/2025 IN O.S.NO.7/2024

Between:
Zilekha Banu and two others. ...Plaintiffs
V/s.
Gulla Abdul Nabi and 31 others. ...Defendants
TO:
R-33. Vadde Venkata Lakshmi W/o Vadde Thimmappa, aged about 40 years, Housewife, resident of H.No.16/299, Yemmiganur, Kurnool District.
R-34. Vadde Bharat Kumar S/o Vadde Thimmappa, aged about 22 years, Mason, resident of H.No.16/299 Yemmiganur, Kurnool District.

Whereas the above named the petitioners filed a petition Under order 39 Rule 1 & 2 and section 151 C.P.C., for grant of temparory injunction restraining the Respondents from alienating the petition schedule properties till the disposal of the suit. You are hereby directed to appear before this Honorable court on dt.16-12-2025 at 10-30 AM., either in person or through your Advocate and file counter if any, failing which, the matter will be decided in your absence and you will be set exparte.

SHRI. Y.R. MALLIKARJUNA,
SHRI. S.SALMAN SAIF ,
ADVOCATES FOR PETITIONERS.
ADONI-518301.
HEARING DATE: 16-12-2025.

పరిశుభ్రత-జంతు నియంత్రణలో కఠిన చర్యలు

-మున్సిపల్ హైస్కూల్‌లో కుక్కల తరలింపు
-సీతారాం నగర్‌లో పశువులు ఎల్ఐసి పార్కుకు తరలింపు
- నిర్మల్ నగర్ ఖాళీ స్థలాల శుభ్రత కార్యక్రమం
-అపరిశుభ్ర స్థలాలు స్వాధీనం చేసుకుంటాం



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రహదారి భద్రత, జంతు నియంత్రణఈ అంశాల్లో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడడం, నగర అందాన్ని మెరుగుపరచడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి కర్నూలు నగరపాలక సంస్థ కఠిన చర్యలు చేపడుతున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో జంతు నియంత్రణ–పరిశుభ్రత చర్యలు ప్రారంభించినట్లు కమిషనర్ వెల్లడించారు. కమిషనర్ పి.విశ్వనాథ్.. దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల పరిసరాల్లో సంచరిస్తున్న కుక్కలను ప్రత్యేక బృందాలు పట్టుకొని తరలించామని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకున్నామని తెలిపారు. సీతారాంనగర్ పరిసరాల్లో వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న పశువులను గుర్తించి ఎల్ఐసి పార్కుకు తరలించామని చెప్పారు. నిర్మల్ నగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రయివేటు ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రత కార్యక్రమం చేపట్టామని, చెత్త–పిచ్చిమొక్కలు పేరుకుపోవడం ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉండటంతో తక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులు స్వచ్ఛందంగా శుభ్రత నిర్వహించాల్సి ఉంటుందని, లేని పక్షంలో నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కమిషనర్ హెచ్చరించారు. నగరంలో రహదారులపై పశువులను వదిలేస్తే గోశాలకు తరలించి, ఒక వారంలో జరిమానా చెల్లించకపోతే యాజమాన్య హక్కులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ నిర్వహకులు మిగిలిన ఆహారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం కుక్కల బెడద పెరగడానికి ప్రధాన కారణమవుతుందని, మిగిలిన ఆహారాన్ని తప్పనిసరిగా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అప్పగించాలని సూచించారు. ఫంక్షన్ హాల్స్, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రార్థన మందిరాలు, జనసమ్మర్థ ప్రాంతాల్లో శునకాలు ప్రవేశించకుండా ప్రహారీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోకపోతే, మున్సిపాలిటీ స్వయంగా శుభ్రం చేసి మున్సిపల్ కార్యకలాపాలకు వినియోగించుకునే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, కార్యదర్శి బి.నాగరాజు, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, పాల్గొన్నారు.

యశోదలో హైరిస్క్ గుండె ఆపరేషన్ విజయవంతం

- హాస్పిటల్ వైద్యులు ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ. గురు ప్రకాష్
ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరానికి చెందిన కుమ్మరి మద్దిలేటి 19 సంవత్సరాల క్రితం గుండె ఎడమవైపు నాళానికి స్టంట్ వేయించుకున్నారు. ప్రస్తుతం గత ఆరు నెలల క్రితం విపరీతమైన ఆయాసం రావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రవేట్ ఆసుపత్రులను సంప్రదించినా ఫలితం లేవకపోవడంతో చివరకు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ వైద్యులను సంప్రదించారు. అక్కడ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ గురు ప్రకాష్, కె మద్దిలేటి కి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. గుండె ఎడమ కుడి వైపు ఉన్న రెండు నాళాలలో కుడివైపు పూర్తిగా ఎడమ వైపు రక్తనాళం 80 శాతం మూసుకుపోయింది. దీంతో ఎడమ వైపు రక్త నాళానికి స్టంట్ వేశారు. సక్సెస్ అయిన నెల తర్వాత కుడి వైపు పూర్తిగా మూసుకుపోయిన రక్తనాళానికి ఓపెన్ చేయుటకు ఎడమవైపు స్టంట్ వేసిన రక్తనాళం మీదుగా చిన్నచిన్న రక్తనాళాల నుంచి వెనుక భాగం నుంచి ఆపరేషన్ ప్రారంభించారు.



సుమారు ఐదు గంటల పాటు శ్రమించిన తర్వాత ఆపరేషన్ విజయవంతమైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ ఎ గురు ప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి క్లిష్టమైన గుండె ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్లోనే మొదటిదిగా చెప్పవచ్చన్నారు. చిన్నచిన్న రక్తనాళాల ద్వారా మూసుకుపోయిన రక్తనాళాన్ని ఓపెన్ చేయడం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సాధ్యమైందని చెప్పారు. ఇప్పటికే తాను క్లిష్టమైన ఐదు ఆపరేషన్లను విజయవంతం చేశానని తెలిపారు. జపాన్ వైద్యుల పర్యవేక్షణలో కొన్ని ఆపరేషన్లలో పాల్గొన్నానని, ఆ అనుభవంతో ఈ ఆపరేషన్ చేశానని తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. రోగి కె.మద్దిలేటి మాట్లాడుతూ తనకు వచ్చిన అనారోగ్యాన్ని డాక్టర్ గురు ప్రకాష్ ఆపరేషన్ ద్వారా పోగొట్టాడని తెలిపారు. గుండె కోత గాని బైపాస్ ఆపరేషన్ కానీ లేకుండా తనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించిన డాక్టర్ గురు ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్, కర్నూల్ సెంటర్ ప్రతినిధులు బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

అమర గాయకులు ఘంటసాల

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

తెలుగుజాతికి వరం తెలుగుజాతికి దేవుడిచ్చిన వరం పద్మశ్రీ ఘంటసాల అని అమర గాయకులని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి టీజీవి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి వేడుకలు జరిగాయి. గాయనీ గాయకులు అఖిల, డాక్టర్ డిఎ మిత్ర, శ్రీనివాసులు బందం సంగీత కచేరి నిర్వహించారు. అంతకుముందు ఘంటసాల చిత్రపటానికి పుష్పమాలను సమర్పించి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి పుల్లయ్య, ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షులు బిఎస్ రావు, ప్రముఖ వైద్యులు డబ్ల్యూ సీతారాం, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కన్వీనర్ ఇనాయతుల్ల, మహమ్మద్‌మియా, కార్యదర్శి యాగంటి ఈశ్వర్ పాల్గొన్నారు. అంతకుముందు మాస్టర్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు రఘుకుల తిలక పాటకు కోలాటం చేశారు. అనంతరం గాయనీ గాయకులను టీజీ వెంకటేష్ సత్కరించి మాట్లాడుతూ టిజీవి కళాక్షేత్రంలో కళాకారులకు ఉచితంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. కళాకారుల అభివృద్ధి కోసం టీజీవి కళాక్షేత్రం నిరంతరం కృషి చేస్తుందన్నారు.



అలరించిన సంగీత విభావరి :

ఘంటసాల సుశీల పాటలను గాయనీ గాయకులు డిఎ. మిత్ర, అఖిల, సుశీలలు ఆడవే జలకమ్ములాడవే, తెలిసిందిలే, రేపంటే రూపం కంటి, అహో ఆంధ్రభోజ, ఆలయాన వెలసిన, ఈ జీవన తరంగాలలో వంటి అనేక గీతాలను ఆలపించి ప్రేక్షకులను మైమరిపించారు. కరతాల ధ్వనులతో కళాక్షేత్రం మార్మోగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి రామస్వామి, కెవి రమణ, బి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే సంకల్పానికి కాదు

-పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ నబి సాహెబ్

ప్రజాశక్తి- క్రిష్ణగిరి : మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ నబి సాహెబ్, టిడిపి సీనియర్ నాయకుడు మర్రి శ్రీరాములు, టిడిపి మండల అధ్యక్షుడు దామోదర్ నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు రఫీ, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గురుస్వామి పాల్గొన్నారు. పత్తికొండ మార్కెట్ యార్డ్‌చైర్మన్ నబి సాహెబ్ మాట్లాడుతూ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. వికలాంగులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ట్రై సైకిల్స్ వంటి అవసరాలను తీరుస్తుందని పేర్కొన్నారు, పింఛన్ రూ.3000 నుంచి రూ.6 వేలకు పెంచి వారి అభివృద్ధికి కషి చేస్తుందన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు మర్రి శ్రీరాములు మాట్లాడుతూ శారీరకంగా ఇబ్బందులు ఉన్న సంకల్పానికి ఎక్కడ ఇబ్బందులు లేవని, అన్నింటిలోనూ రాణించి దూసుకుపోవడానికి మనమందరం సిద్ధంగా ఉన్నామన్నారు. కూటమి ప్రభుత్వం 17 నెలల్లో విభిన్న ప్రతిభావంతులను ఎలా ఆదుకోవాలని ఒక కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేసిందన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే మొట్టమొదటి సంతకం తోనే పెన్షన్లు పెరిగాయన్నారు. వివిధ వ్యాపారాలు , రంగాలలో వికలాంగులు పైకి తీసుకురావడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు దామోదర్ నాయుడు మాట్లాడారు.ఎమ్మార్వో రాజేష్, ఎపిఎం మహేష్, విఆర్ఒ వెంకటేశ్వర్లు, సెక్రెడ్ డైరెక్టర్ తిమ్మప్ప, మండల వికలాంగుల అధ్యక్షుడు రాజేంద్ర, ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, వీరేశమ్మ , మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవి.నారాయణ

అభివృద్ధికి నోచుకోని గూడూరునగర పంచాయతీ

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలాలలో సిపిఎంకార్యకర్తలతో గురువారం ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్ అధ్యక్షుని నిర్వహించారు. ముఖ్య అతిథి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ మాట్లాడుతూ 2011లో గూడూరు పట్టణాన్ని నగర పంచాయతీ చేసి ప్రజలపై పన్నుల భారాలు వేశారుతప్ప మున్సిపాలిటీలో ప్రజలకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. నగర పంచాయతీలో రూ.11 కోట్ల నిధులు ఉన్నాయంటున్నారు కానీ ఆ నిధులతో గూడూరు పట్టణంలో అభివృద్ధి పనులు చేయకుండా అధికారులు, పాలకులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి నాయకులైనా అభివృద్ధి చేస్తారేమో అని అనుకుంటే టిడిపి నాయకులు ఉత్తమ మున్సిపాలిటీగా అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పారుతప్ప ఆచరణలో సాధ్యపడలేదన్నారు. కాదని ఇప్పటికైనా కొన్ని వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ విషయమై వేసవికాలంలో పట్టణంలో తీవ్రంగా అవుతుందన్నారు. ఊరికి నాలుగు దిక్కులు ఉన్నట్లుగా గూడూరు పట్టణానికి నాలుగు దిక్కులుగా నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మాణం చేపట్టారన్నారు. ఆ ట్యాంకుల నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ వెంటినే ట్యాంకులను నిర్మాణం పూర్తి చేస్తే గూడూరు పట్టణంలో ప్రజలకు తాగడానికి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పట్టణాలలో చాలా వార్డుల్లో డ్రెయినేజీ కాలువలు సమస్య, మహిళలకు మరుగుదొడ్లు సమస్య, సిసి రోడ్లు సమస్య చాలా ఉన్నాయన్నారు. గూడూరు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున సిపిఎం తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు కె. రాజశేఖర్, వెంకటేశ్వర్లు ,గూడూరు, సి బెలగల సిపిఎం నాయకులు మద్దిలేటి ,ఖాజా హుస్సేన్, మాధవకృష్ణయ్య, రామాంజనేయులు, దానమన్న, మధు, రాజు, రంగడు, పరమేష్, జైలు గోపాల్, గూడూరు మండల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డాక్టర్ నాగరప్రసాద్‌కు జన్మదిన వేడుకలో సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ సీతారామ్

మెడికవర్ డాక్టర్ నాగసురేష్ జన్మదిన వేడుక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్స్, కర్నూలులో సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నాగ సురేష్ జన్మదినాన్ని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్చర్యకరంగా సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీతారాం కూడా పాల్గొని డాక్టర్ సురేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ విశ్వకుమార్, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ బిఎస్. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ జనరల్ సర్జన్ డాక్టర్ భార్గవ వ్యాస్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సరయు రెడ్డి, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ రఘు నందిని తమ ప్రత్యేక శుభాకాంక్షలను తెలిపారు. వైద్య బందంతో కలిసి కేక్ కట్టింగ్ నిర్వహించగా, కార్యక్రమంలో మెడికోవర్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి డాక్టర్ నాగ సురేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ల మధ్య స్నేహభావం, ఐక్యతను ప్రతిబింబిస్తూ జరిగిన ఈ వేడుక హాస్పిటల్ వాతావరణాన్ని సందడి చేసింది.

బీసీ హాస్టళ్లలో పోస్టులను భర్తీ చేయాలి

-వైసిపి స్టూడెంట్ వింగ్ స్టేట్ సెక్రటరీ కటారుకొండ సాయి కుమార్
ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్ - 2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మొత్తం 1,110 బీసీ హాస్టళ్లలో 743 బాలుర, 367 బాలికల అరకొర సౌకర్యాలతోనే నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ హాస్టళ్లలో మౌళిక వసతులతో పాటు అద్దె భవనాలలో నిర్వహిస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.